క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్: విద్యుత్ సంబంధిత మరమ్మతు పనుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈ హన్మంత్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు లక్ష్మీనగర్ కాలనీ పార్క్, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్, లీడ్ ఇండియా స్కూల్, లంబాడీ పీటీ, జయానగర్ పార్క్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు. మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు జయానగర్, సరస్వతీనగర్ పాంపుట్ట, సింగరేణి కాలనీ, ఆటోమీటర్ సీల్ ఆఫీస్, గ్రీన్‌పార్క్ కాలనీ, సరూర్‌నగర్ మెయిన్‌రోడ్, సరస్వతీ శిశుమందిర్, విష్ణునగర్, ఆదర్శ్‌నగర్, సింగరేణి క్లబ్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపేస్తామని డీఈ వివరించారు.

సీసీ రోడ్ల నిర్మాణాన్ని సత్వరమే పూర్తిచేయాలి

దిల్‌సుఖ్‌నగర్: ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆయా కాలనీల్లో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులను సత్వరమే పూర్తి చేయాలని ఆర్‌కేపురం కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డి జీహెచ్‌ఎంసీ అధికారులు, కాంట్రాక్టర్‌లకు సూచించారు. సోమవారం మార్గదర్శి కాలనీలో పర్యటించి కంకర తేలి గుంతలుగా మారిన రోడ్లను ఆమె పరిశీలించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ... కాలనీలో రోడ్లు కంకర తేలి గుంతలుగా ఏర్పడటంతో నీరు చేరి రోడ్లు మొత్తం అధ్వానంగా తయారయ్యాయని పేర్కొన్నారు. మార్గదర్శి కాలనీలో సీసీ రోడ్డు కోసం మేరకు జీహెచ్‌ఎంసీ నిధుల నుంచి రూ. 76 లక్షల మంజూరైందన్నా. బీజేపీ సీనియర్ నాయకులు ధీరజ్‌రెడ్డి, బీజేపీ ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షుడు రాములు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

షర్మిల పాదయాత్రలో ఎల్‌బీనగర్ నేతలు



పాదయాత్రలో పాల్గొన్న వైఎస్సార్‌టీపీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి మామిడి రాంచందర్

మన్సూరాబాద్: వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వై.ఎస్.షర్మిల చేపడుతున్న మరో ప్రస్థానం పాదయాత్రకు వైఎస్సార్ టీపీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి మామిడి రాంచందర్ ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్ నుంచి భారీ స్థాయిలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. నాయకులు బోడ శ్రవణ్, పోచబోయిన శ్రీకాంత్‌యాదవ్, చెన్నమ్మ, మల్లేష్, రాంచంద్రయ్య, లక్ష్మణ్, అశోక్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులను సక్రమంగా నిర్వహించాలి



నందనవనం కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సుజాతానాయక్

హస్తినాపురం: పేదలు నివాసం ఉంటున్న ప్రాంతాలలో పారిశుద్ధ్య పనులను సక్రమంగా నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. నందనవనం కాలనీ, ఇంద్రసేనారెడ్డినగర్, దేవీనగర్ తదితర ప్రాంతాలలో ఆయాకాలనీల ప్రజలతో కలిసి ఆమె పర్యటించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సుజాతానాయక్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... మురికివాడలలో నివసిస్తున్న ప్రజలకు మౌలిక వసతులు ఏర్పాటు చేసేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటామన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, సాయియాదవ్, అనిత, ఆదిలక్ష్మీ, విజయ్, వెంకట్, మహేందర్, శశి, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాధనాన్ని స్వాహా చేస్తున్న బీజేపీ, బీఆర్‌ఎస్'



మలక్‌పేట: బీజేపీ, బీఆర్‌ఎస్ రెండు ఒకే తాను ముక్కలని, సంక్షేమం విస్మరించి ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నాయని టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి చేకోలేకర్ శ్రీనివాస్ ఆరోపించారు. టీ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టిన 'హాథ్ సే హాథ్ జోడో' యాత్రకు మద్దతుగా సోమవారం శ్రీనివాస్ ఆధ్వర్యంలో సలీంనగర్‌లో ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంచిపెట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజలకు వివరించారు. కార్యకర్తతో కలిసి ఆయన మలక్‌పేట నుంచి మేడారం తరలివెళ్లారు. నాయకులు యాదిలాల్, మహేష్, సాయిరామ్, భరత్, రక్షిత్, మనీష్, రాజిరెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా గ్రంథాలయాల అభివృద్ధి

- పాఠకులకు మెరుగైన వసతులు
- గ్రంథాలయాలకు కొత్త భవనాలు
- నిరుద్యోగులకు అందుబాటులో స్టడీ మెటీరియల్
- జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి



ఎన్జీవోస్‌కాలనీ గ్రంథాలయంలో పాఠకుల నుంచి వివరాలు తెలుసుకుంటున్నసంస్థ ఛైర్మన్ వెంకటరమణారెడ్డి

వనస్థలిపురం: జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టినట్లు రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి తెలిపారు.

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన తొలిసారిగా జిల్లాలో గ్రంథాలయాల సందర్శనకు శ్రీకారం చుట్టారు. జిల్లా గ్రంథాలయ కార్యదర్శి మనోజ్‌కుమార్‌తో కలసి సోమవారం వనస్థలిపురం, సరూర్‌నగర్ గ్రంథాలయాలను సందర్శించారు. వాటిల్లో వసతులను పరిశీలించి, సమస్యలను పాఠకులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.
- ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సూచనల మేరకు వనస్థలిపురం ఎన్జీవోస్‌కాలనీలోని శాఖా గ్రంథాలయానికి రూ. 2 కోట్ల నిధులతో అధునాతన భవనాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు.
- సరూర్‌నగర్ శాఖా గ్రంథాలయంలో అదనపు శాఖాలయాలు నిర్మించాలని మంత్రి సబితాఇంద్రారెడ్డి ఆదేశించారన్నారు. వెంటనే తగిన చర్యలు చేపడతామన్నారు.
- జిల్లాలో రూ. 9 కోట్ల నిధులతో పలు గ్రంథాలయాల భవనాల నిర్మాణం జరుగుతోందన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో మరిన్ని భవనాల నిర్మాణానికి చర్యలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.
- ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్ అందుబాటులో ఉంచామని, అవసరమైన బుక్స్ కొనేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు.
- కార్యక్రమంలో గ్రంథ పాలకులు పద్మ, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా ప్రత్యంగిరా పరమేశ్వరి బ్రహ్మోత్సవాలు



ప్రత్యంగిరా దేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

దిల్‌సుఖ్‌నగర్: పీఠాధిపతులు జగద్గురువులు శ్రీ సిద్ధేశ్వరానందభారతీ మహాస్వామి వారి ఆశీస్సులతో ఆర్‌కేపురంలోరి కుర్తాళం పీఠ విభాగ, ఆదిపరాశక్తి శ్రీ ప్రత్యంగిరా పరమేశ్వరి మందిరంలో అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. పీఠం పండితులు బ్రహ్మశ్రీ మాచవోలు రమేష్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష 18 రకాల ద్రవ్యాలతో అభిషేకాన్ని నిర్వహించారు. అనంతరం యాగ పండప దేవతా హోమాలు, పూజలు, మహిళలతో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అమెరికా భక్తులు గాలి భరద్వాజ్ హారిక దంపతులు అమ్మవారికి బంగారు పుస్తెలతాడును సమర్పించారు. మరో భక్తుడు కష్టమూర్తి దంపతులు కాలభైరవ స్వామికి వెండి కవచాన్నిను సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్ వారికి అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో మునిపల్లె శ్రీనివాస్, మునిపల్లె సువర్ణలత తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో మరింత భద్రత: డీసీపీ సాయిశ్రీ



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న డీసీపీ సాయిశ్రీ

చైతన్యపురి: ప్రతి కాలనీలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే భద్రత మరింత పటిష్టం అవుతుందని ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ అన్నారు. చంపాపేట డివిజన్ పవన్‌పురి కాలనీలో కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఏసీపీ శ్రీధర్‌రెడ్డి, సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సీతారాంతో కలసి డీసీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ... సీసీ కెమెరాలు నేరాల నియంత్రణతోపాటు నేర నిరూపణకు ప్రధాన సాక్ష్యాలుగా ఉపయోగపడతాయన్నారు. కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు నరసింహారెడ్డి మాట్లాడుతూ... మల్కాజిగిరి ఎంపీ రేవంత్ రెడ్డి నిధుల నుంచి రూ. 5 లక్షలు, అసోసియేషన్ సమకూర్చిన రూ. 8 లక్షలతో 19 కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు.

సద్దుమణిగిన బాక్స్ డ్రెయిన్ వివాదం

శంకేశ్వరబజార్ చౌరస్తాలో పనులు ప్రారంభం



శంకేశ్వరబజార్‌లో అధికారులు, స్థానికులతో చర్చిస్తున్న ఇంద్రసేనారెడ్డి, కార్పొరేటర్ ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

సైదాబాద్: సరూర్‌నగర్ చెరువు పరిసర ప్రాంతాల్లో ముంపు సమస్య పరిష్కారం కోసం నిర్మిస్తున్న బాక్స్ డ్రెయిన్ నిర్మాణ పనులను శంకేశ్వరబజార్ చౌరస్తాలో ఐదు రోజులుగా స్థానికులు అడ్డుకుంటున్నారు. బాక్స్ డ్రెయిన్‌ను శంకేశ్వరబజార్ చౌరస్తాలోని మసీదు వెనుక ఉన్న నాలాతో అనుసంధానిస్తే పరిసర కాలనీలు నీట మునుగుతాయని వారు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ పనులు కొనసాగించలేదు. దీంతో నిర్మాణ పనులు ముందుకు సాగక అక్కడ గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. సోమవారం మలక్‌పేట మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు ఇంద్రసేనారెడ్డి, గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, కొత్తకాపు రవీందర్‌రెడ్డి, చిలుకూరు రామిరెడ్డి అక్కడికి చేరుకొని స్థానికులు, అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ... శంకేశ్వర బజార్ చౌరస్తా నుండి మూసీ వరకు గతంలోనే భారీ వరదనీటి కాలువా నిర్మించి ఉన్నదని తెలిపారు. ఇక్కడి బాక్స్ డ్రెయిన్‌ను దానికి కలిపితే ఇబ్బందులు తొలుగుతాయన్నారు. ఎస్‌ఎన్‌డీపీ అధికారులు కూడా స్థానికులకు నిర్మాణ వివరాలు వెల్లడించారు. ఒకవేళ నిర్మాణం వలన పరిసర ఇళ్లకు ఏమైనా నష్టం వాటిల్లితే తామే వాటిని సరి చేస్తామని వారు హామీ ఇచ్చారు. బీజేపీ నాయకులు, అధికారులు వివరించి సముదాయించటంతో స్థానికులు శాంతించారు. దాంతో ఐదు రోజులుగా కొనసాగిన వివాదం సద్దుమణిగింది. స్థంభించిన బాక్స్ డ్రెయిన్ నిర్మాణ పనులను ఎస్‌ఎన్‌డీపీ అధికారులు మరలా ప్రారంభించారు. ఎస్‌ఎన్‌డీపీ డీఈ వెంకట్ కిరణ్ మాట్లాడుతూ... శంకేశ్వరబజార్ చౌరస్తాలో బాక్స్ డ్రెయిన్ నిర్మాణ పనులను 45 రోజుల్లో పూర్తిచేస్తామని తెలిపారు.

పార్కుల అభివృద్ధికి కృషి: కార్పొరేటర్ లచ్చిరెడ్డి



పార్కును పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి, హార్టికల్చర్ అధికారి మేధా

ఎల్‌బీనగర్: కాలనీలో పార్కులను అభివృద్ధి చేసి ప్రజలకు అహ్లాదాన్ని పంచేందుకు తన వంతు కృషి చేస్తానని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని శ్రీపురం కాలనీలో పార్కు స్థలాన్ని హార్టికల్చర్ అధికారి మేధా, కాలనీ వాసులతో ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... పార్కు స్థలాలు కబ్జా కాకుండా చర్యలు తీసుకుంటానన్నారు. కాలనీ నేతలు పద్మారెడ్డి, చంద్రయ్య, నర్సింహారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, సురేందర్‌రెడ్డి, జంగయ్య, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నక్క దర్శన్‌గౌడ్‌కు సేవారత్న అవార్డు

హయత్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల హక్కుల సాధనలో విశేష కృషి చేసిన రాష్ట్ర ప్రభుత్వ పంచాయితీరాజ్ ఉద్యోగ సంఘాల మాజీ అధ్యక్షుడు నక్క దర్శన్‌గౌడ్‌కు స్ఫూర్తి సర్వీసెస్ ఇండియా సంస్థ సేవా రత్న అవార్డుతో సత్కరించింది. నగరంలోని తెలంగాణ సారస్వత పరిషత్ హాలులో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఫిలిం చాంబర్ చైర్మన్, నిర్మాత పితాని రామకృష్ణాగౌడ్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా నక్క దర్శన్‌గౌడ్ మాట్లాడుతూ... వేలాది ఉద్యోగుల పదోన్నతులు పొందడానికి, ఉద్యోగులకు 010 పద్దు ద్వారా నెల నెల జీతాలు పొందేలా పోరాటం చేశామని, ఉద్యోగ విరమణ తర్వాత కూడా పెన్షన్ దారుల హక్కుల కోసం పోరాడుతున్నామన్నారు. ఈ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందని, విశ్రాంత ఉద్యోగుల హక్కుల కోసం అవిశ్రాంత పోరాటం చేస్తామని ఆయన స్పష్టం చేశారు.


విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలి: పీడీఎస్‌యూ



మూసారంబాగ్ చౌరస్తాలో ఆందోళన చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

మలక్‌పేట: విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ ఈస్ట్‌జోన్ కమిటీ అధ్యక్షుడు మందుల సైదులు ఆధ్వర్యంలో సోమవారం మూసారంబాగ్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా గ్రేటర్ అధ్యక్షుడు మంద నవీన్ మాట్లాడుతూ... విద్యారంగానికి పెద్దపీట వేశామని చెప్పుకుంటున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం బడ్జెట్‌లో సరిపడా నిధులు కేటాయించకపోవడం సిగ్గుచేటన్నారు. అరకొర నిధులతో విద్యారంగాన్ని నిర్వీర్యం చేసేకుట్ర చేస్తోందన్నారు. 30 శాతం నిధులు కేటాయించకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, శివాజీ, ప్రవీణ్, ఉదయ్ తదితరుల పాల్గొన్నారు.

పింఛన్ కార్డులను పంపిణీ చేయాలని కార్పొరేటర్ల ధర్నా



ధర్నా చేస్తున్న కార్పొరేటర్లు మధుసూదన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, నర్సింహగుప్తా, ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ సర్కిళ్ల పరిధిలో మంజూరైన పింఛన్లు ఇవ్వకుండా అధికారులు జాప్యం చేస్తున్నారని, దీంతో వృద్ధులు వింతంతువులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే లబ్ధిదారులకు మంజూరైన పింఛన్ కార్డులను ఇవ్వాలని కోరుతూ సోమవారం సర్కిల్ కార్యాలయాల ఎదుట కార్పొరేటర్లు వంగ మధుసూదన్‌రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి, రంగ నర్సింహగుప్తా, బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డిలు లబ్ధిదారులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మునుగోడు ఉప ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అక్టోబర్ 15న పనామా చౌరస్తాలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో హడావుడిగా కొంత మంది లబ్ధిదారులకు కార్డులు మంజూరు చేశారని ఆరోపించారు. మిగతా వారి కార్డులు ఎమ్మెల్యే తన వద్దే ఉంచుకుని ఆయన మనుషులతో పంపిణీ చేయిస్తుండటంతో వారు లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. పింఛన్ మంజూరైందని లబ్ధిదారులకు చెప్పిన అధికారులు కార్డులను మాత్రం ఇవ్వకుండా దాచిపెట్టడం పట్ల వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కావాలనే మన్సురాబాద్, చంపాపేట డివిజన్లకు చెందిన లబ్ధిదారుల కార్డులను దాచిపెట్టారని ఆరోపించారు. పింఛన్ మంజూరైనన వారికి ఇప్పటి వరకు పింఛన్ డబ్బులు జమ కావడం లేదని ధ్వజమెత్తారు. మన్సురాబాద్ డివిజన్‌లోని సుమారు 500 మందికి పింఛన్ మంజూరైతే కార్పొరేటర్‌కు తెలియకుండా ప్రైవేటు వ్యక్తుల ద్వారా కార్డులను పంపిణీ చేయడం సమంజసమా అయన ప్రశ్నించారు. ఇకనైనా అధికారులు స్పందించి మంజూరైంన పింఛన్‌దారులకు వెంటనే కార్డులు అందజేయాలని డిమాండ్ చేశారు. ధర్నా చేస్తున్న కార్పొరేటర్లకు డీసీలు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి ధర్నాకు దిగిన కార్పొరేటర్లను శాంతింపజేశారు. మన్సూరాబాద్ బీజేపీ అధ్యక్షుడు నాంపల్లి రామేశ్వర్, హరీష్ రెడ్డి, నేతలు ముత్యంరెడ్డి, పాతూరి శ్రీధర్‌గౌడ్, కవితారెడ్డి, సిద్దు, పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు పటిష్ట ఏర్పాట్లు చేయండి

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, అధికారులు

ఎల్‌బీనగర్: సరూర్‌నగర్ స్టేడియం వద్ద ఈ నెల 11న నిర్వహించే జాబ్‌మేళాకు వచ్చే నిరుద్యోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో పోలీస్, జీహెచ్‌ఎంసీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... తాగునీరు, టాయిలెట్లు, పార్కింగ్ తదితరాలకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జాబ్‌మేళాకు సుమారు 20 వేల మంది నిరుద్యోగులు హాజరు కానున్నట్లు ఆయన వెల్లడించారు. దీంతో వచ్చే వారికి ఎలాంటి ట్రాఫిక్ సమస్య లేకుండా పోలీస్ అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే జాబ్ మేళాకు ఆన్‌లైన్‌లో 6 వేల మంది రిజిస్టర్ చేసుకున్నారన్నారు. ఎల్‌బీనగర్ సర్కిల్ అధికారులు శానిటేషన్‌పై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసమైనచోట వీధి దీపాలను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఎల్‌బీనగర్ ఏసీపీ శ్రీధర్‌రెడ్డి, డీసీ హరికృష్ణయ్య, ఇన్‌స్పెక్టర్లు అంజిరెడ్డి, వెంకటేశ్వర్లు శానిటేషన్ నిర్వహణ అధికారి నీలిమ పాల్గొన్నారు.

భవిష్యత్ బీజేపీదే: సామ రంగారెడ్డి



శక్తికేంద్రాల ఇన్‌చార్జిల సమావేశంలో పాల్గొన్న సామ రంగారెడ్డి, లచ్చిరెడ్డి తదితరులు

ఎల్‌బీనగర్: వచ్చే ఎన్నికల్లో ఎల్‌బీనగర్‌లో బీజేపీదే విజయం అని రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలో బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన శక్తి కేంద్రం ఇంచార్జీల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా సామ మాట్లాడుతూ... ప్రధాని నరేంద్ర మోడీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను నేరుగా ప్రజల వద్దకు తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి మాట్లాడుతూ... పార్టీ పటిష్టతకు బూత్ స్థాయిలో కార్యకర్తలు పనిచేయాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ విజయం కోసం సమష్టిగా పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో బీజేపీ నాయకులు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, నవకిశోర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి, శంకరయ్యగౌడ్, సందీప్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, శరత్, రవిశంకర్, విష్ణువర్ధన్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, లక్ష్మీకాంత్, ప్రేమ్, శివ, సంగమేశ్వర్, శ్రీనివాస్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

దృష్టి మళ్లించి చోరీలు: ఆటో డ్రైవర్ అరెస్టు



పోలీసులు అరెస్టు చేసిన శ్రీను

నాగోలు: దృష్టి మళ్లించి చోరీలకు పాల్పడుతున్న ఆటో డ్రైవర్‌ను ఎల్‌బీనగర్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుంచి రూ. 30 వేల విలువైన వస్తువులను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. ఎల్‌బీనగర్ పోలీసుల సమాచారం మేరకు... ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా సంతమాగులూరు చెందిన పెద్దింటిగొల్ల శ్రీను అలియస్ మేకల శ్రీను(40) వృతి రీత్యా ఆటో డ్రైవర్. కొంత కాలం క్రితం నగరానికి వచ్చి మీర్‌పేట టీఆర్‌ఎస్‌ఎస్ స్కూల్ ఎదురుగా నివాసం ఉంటున్నాడు. మూడు రోజుల క్రితం మాన్సూరాబాద్ సౌత్ ఎండ్ పార్క్‌లో కూరగాయలు కోనేందుకు హిమాపురికాలనీ చెందిన వి.వెంకటరమణాచార్యులు మార్కెట్ వచ్చారు. శ్రీను అక్కడికొచ్చి రూ. 50 కింద వేసి వెంకటరమణాచార్యులు దగ్గరికెళ్లి మీ డబ్బు కింద పడిపోయింది అని చెప్పాడు. వెంకటరమణాచార్యులు కింద పడిన డబ్బులు తీసుకోవడానికి వంగినప్పుడు నిందితుడు అతని చొక్కా జేబులోని మొబైల్ ఫోన్ లాక్కొని పారిపోయాడు. దీంతో బాధితుడు ఎల్‌బీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఎన్టీఆర్‌నగర్ కూరగాయల మార్కెట్ వద్ద చోరీ చేసేందుకు వచ్చిన శ్రీనును పోలీసులు అరెస్టు చేశారు. గతంలో శంకర్‌పల్లి, మీర్‌పేట్ తదితర ప్రాంతాల్లో చోరీ చేసినట్లు విచారణలో నిందితుడు అంగీకరించాడని పోలీసులు తెలిపారు.

డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా తదితరులు

నాగోలు: దేశంలో ప్రైవేటు ఉద్యోగులకు, కార్మికుల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ అన్ని విధాలా అండగా ఉంటారని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. సోమవారం నాగోలు తన కార్యాలయంలో తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గంధం రాములు ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం డైరీని ఆవిష్కరించారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గంధం రాములు, ఉప్పల ఫౌండేషన్ వైస్ చైర్మన్ పర్సన్ ఉప్పల స్వప్న, సంఘం సోషల్ మీడియా ఇంచార్జీ మోహన్ నాయక్, రంగారెడ్డి డిస్ట్రిక్ ఉపాధ్యక్షులు శంకర్ గౌడ్, శ్రీనివాస్‌గుప్తా, విష్ణుగుప్తా తదితరులు పాల్గొన్నారు.

పేద యువతి వివాహానికి చేయూత...

కర్మన్‌ఘాట్ నందనవనం కాలనీలోని పేద యువతి ఈగల భాగ్యలక్ష్మి వివాహానికి ఉప్పల శ్రీనివాస్ గుప్తా చేయూతనందించారు. సోమవారం నాగోల్‌లో తన క్యాంప్ కార్యాలయానికి వచ్చి కలిసిన వారికి ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళ సూత్రం, మెట్టెలు, చీర, గాజులను విరాళంగా అందజేశారు. వధువు భాగ్యలక్ష్మి, చంద్రకళ, జగన్, పి.యాదగిరిగౌడ్ ఎన్.కృష్ణ ఎం.యాదగిరి, ఎస్.దర్శన్ యాదయ్య పాల్గొన్నారు.

చెరువులో చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలి



చెరువులోని చెత్తను శుభ్రం చేయిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

చైతన్యపురి: సరూర్‌నగర్ చెరువులో చెత్త, వ్యర్థాలు వేయకుండా తగు చర్యలు తీసుకోవాలని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం సరూర్‌నగర్ చెరువులో పేరుకుపోయిన చెత్తను జీహెచ్‌ఎంసీ సిబ్బందితో శుభ్రం చేయించారు. చెరువు సమీప కాలనీల ప్రజలు కవర్లలో తమ ఇండ్లలోని చెత్తను తీసుకొచ్చి వేస్తున్నారన్నారు. స్వచ్ఛ ఆటోల సిబ్బందికి మాత్రమే చెత్తను అందజేయాలని కోరారు. పరసరాలు, చెరువు నీరు పరిశుభ్రంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఎంటమాలజి సిబ్బంది తరచు చెరువులోని చెత్తను తొలగించాలని, దోమలు వ్యాప్తి చెందకుండా క్రిమి సంహారకాలు చల్లాలని కార్పొరేటర్ ఆదేశించారు. నాయకులు రాంరెడ్డి, దాసరి జయప్రకాష్, శ్రీనివాస్‌యాదవ్, శివ, ఎంటమాలజి సూపర్‌వైజర్ అర్జున్ పాల్గొన్నారు.

కళారూపాల పరిరక్షణ అందరి బాధ్యత



లకుమాదేవి నాటకంలోని ఓ సన్నివేశం

దిల్‌సుఖ్‌నగర్: చరిత్రాత్మక కళారూపాలను కాపాడుకోల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జాతీయ ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్ సభ్యుడు పేరాల శేఖర్‌రావు అన్నారు. ఆర్‌కేపురం డివిజన్ చిత్రాలేవుట్ కాలనీ సంక్షేమ సంఘం హాల్‌లో శ్రీ మురళీకృష్ణ సాంస్కృతిక కళాసంఘం ఆధ్వర్యంలో వసంత రాజీయం (లకుమాదేవి) చారిత్రాత్మక పద్యనాటక ప్రదర్శన ఆదివారం రాత్రి నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శేఖర్‌రావు మాట్లాడుతూ... చారిత్రక నాటకాలు, కళాకారులను ఆదరించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. నాటక ప్రదర్శన నిర్వహించిన కళాకారులను అయన అభినందించారు. ఎమ్మెల్సీ గోరటి వెంకన్న మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం కళలు, కళాకారులకు చేయూతనిస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్టంలో కళాకారులకు మంచి గుర్తింపు తీసుకొచ్చారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర నాటక కళాకారుల సమాఖ్య అధ్యక్షుడు తడకమళ్ల రామచంద్రరావు మాట్లాడుతూ... రంగ స్థల కళాకరులను యువత అదిరించాలని... అదుకోవాలని కోరారు. లకుమాదేవి చారిత్రాత్మక పద్యనాటకం ముఖ్య ఉద్దేశం రాజును వధించేందుకు పక్కదేశం రాజు వేసిన పన్నాగం.. లకుమాదేవి పద్యనాటకమని వివరించారు. ఎవరినీ అతిగా నమ్మవద్దని నాటకం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఎస్ఆర్ఆర్ ట్రస్ట్ చైర్మన్ రామచంద్రరావు మాట్లాడుతూ... మార్చిలో మిర్యాలగూడలో నిర్వహించే అఖిల భారత నాటక ఉత్సవాలలో లకుమాదేవి నాటకం మొదటి బహుమతి రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉస్మానియా రంగస్థల శాఖ పూర్వ అధిపతి డాక్టర్ ప్రసాద్‌రెడ్డి, శ్రీ మురళీకృష్ణ సాంస్కృతిక కళా సంఘం అధ్యక్షుడు సోమ అంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి చింతపల్లి కృష్ణయ్య, కేంద్ర సంగీత నాటక అకాడమీ సభ్యురాలు ఎస్వీ భారతి, చిత్రలేవుట్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ముస్కు అంజిరెడ్డి, కాశీనాథ్‌రెడ్డి, హనుమంత్‌రావు, రామలింగయ్య, పాత్రధారులు సోమ అంజిరెడ్డి, సాల్వాచారి, హరినాథ్, ఆకుల సదానందం, బాల నాగేశ్వరరావు, వెంగమాంబ, ప్రభావతి, బుగ్గయ్య, సి.హెచ్.వి. ఆర్కే మూర్తి తదితరులు పాల్గొన్నారు.